
సాక్షి పల్నాడు

శుక్రవారం, 22, డిసెంబర్, 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 522.60 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.



భవానీ దీక్ష ఏర్పాట్ల పరిశీలన

విజయవాడ : ఇంద్రకీలాద్రిపై జనవరి 3వ తేదీ నుంచి జరిగే భవానీ దీక్ష విరమణల ఏర్పాట్లను గురువారం డీసీపీ విశాల్‌గున్ని పరిశీలించారు.



కబడ్డీ పోటీల్లో గుంటూరు సత్తా

విజయనగరం : సీఎం వైఎస్ జగన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని విజయ నగరంలో నిర్వహించిన మహిళల కబడ్డీ పోటీల్లో గుంటూరు జిల్లా జట్టు నాలుగో స్థానంలో నిలిచింది.

న్యూస్‌రీల్

నేడు 'ఆడుదాం ఆంధ్రా' ర్యాలీ

నరసరావుపేట: ఆడుదాం..ఆంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 6.45 గంటలకు మున్సిపల్ కార్యాలయం నుంచి ఎస్ఎస్ఎన్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహిస్తున్నారు. దీనికి జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాదు ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నట్లు పౌరసంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ దీప్తి గురువారం వెల్లడించారు.

27న నిధి ఆప్‌కే నికట్

గుంటూరు ఎడ్యుకేషన్ : గుంటూరులోని ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ఈనెల 27న నిధి ఆప్‌కే నికట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు కృష్ణనగర్‌లోని పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంతో పాటు ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించబడుతుందని తెలిపారు. యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు ఇతర వాటాదారులు, లబ్ధిదారులతో పరస్పరం ముఖాముఖీగా చర్చలు జరుగుతాయని తెలిపారు. పీఎఫ్ భాగస్వామ్య యజమానులందరు కార్యక్రమానికి విధిగా హాజరై, ఫిర్యాదులు ఉంటే వాటిని పరిష్కరించేందుకు వీలుగా ఉద్యోగులతో పాటు అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. తెనాలిలోని జీడీసీసీ బ్యాంక్, కృష్ణాజిల్లా పామర్రులోని రాణి ఆక్వాఫీడ్స్ ప్రైవేటు లిమిటెడ్, ప్రకాశం జిల్లా దర్శిలోని ప్రశాంత స్కూల్, విజయవాడ ఒన్‌టౌన్‌లోని కేబీఎన్ కాలేజీ, అద్దంకి నగర పంచాయతీ కార్యాలయంతో పాటు వినుకొండలోని మున్సిపాల్టీ హాల్లో జరిగే నిధి ఆప్‌కే నికత్‌లలో ఫిర్యాదులు, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

నేటి నుంచి పాలిటెక్నిక్ విద్యార్థినులకు క్రీడా పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్ : గుంటూరు జిల్లా 26వ అంతర్ పాలిటెక్నిక్ మహిళా క్రీడా పోటీలను శుక్ర, శనివారాల్లో గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. ప్రభాకరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 29 పాలిటెక్నిక్‌ల నుంచి 400 మంది విద్యార్థినులు పాల్గొంటున్న క్రీడా పోటీల్లో భాగంగా వాలీబాల్, ఖో-ఖో, చెస్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, రిలే, షాట్‌పుట్, డిస్క్ త్రో, లాంగ్ జంప్, హై జంప్, లాంగ్ జంప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. క్రీడా పోటీలను సీఐడీ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ కేజీవీ సరిత ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు



తెనాలి: గుంటూరు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23-25 తేదీల్లో స్థానిక అన్నాబత్తుని సత్యనారాయణ స్టేడియంలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించనున్నారు. పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం సాయంత్రం స్టేడియంలో ఆవిష్కరించారు. ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఈదర వెంకట పూర్ణచంద్, కార్యదర్శి ఈదర శ్రీనివాసరావు, విశ్రాంత ప్రిన్సిపాల్ గుత్తా వెంకటరత్నం, పీఏ సునీల్, ఆలపాటి కిరణ్, వీరవల్లి శ్రీధర్, ఎలీషా, స్టేడియం కోచ్ కె.నాగరాజు, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యార్డుకు 48,735 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 45,238 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 48,735 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 24,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,500 నుంచి రూ.20,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,000 నుంచి 23,400 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 23,372 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు.

జనోత్సవం.. దివ్యోత్సవం

నవ్యాంధ్ర నవరత్నాల రేడు.. సంక్షేమ జీవన ప్రదాత.. జన హృదయ విజేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా ఊరూవాడా సంబరాలు అంబరాన్నంటాయి. పేదల లోగిళ్లలో ఉత్సాహం ఉరకలెత్తింది. మదిమదిలో కొలువుదీరిన వరాల రాజుకు దీవెనలు వెల్లువెత్తాయి. ఇది జనోత్సవం.. దివ్యోత్సవం అంటూ దిక్కులన్నీ నినదించాయి. దీర్ఘాయుష్మాన్ భవ అంటూ మనసారా ఆశీర్వదించాయి. వైఎస్సార్ సీపీ సేవా కార్యక్రమాలు జనాభిమానం చూరగొన్నాయి.

పేదల పండగ జగనన్న జన్మదినం

- ఇంటింటా వెల్లివిరిసిన ఆనందం
- ఊరూవాడా అంబరాన్నంటిన సంబరాలు
- వైఎస్సార్ సీపీ శ్రేణుల సేవా కార్యక్రమాల వెల్లువ



మాచర్లలో భారీ కేక్ కట్ చేస్తున్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డి



సత్తెనపల్లిలో కేక్ కట్ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సాక్షి, నరసరావుపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు పల్నాడు జిల్లాలో అంగరంగ వైభవంగా జరిగాయి. వాడవాడలా భారీ కేక్‌లతో ఉత్సవాలు, స్వీట్ల పంపిణీ జరిగాయి. పలు ప్రాంతాల్లో మెగా రక్తదాన శిబిరాలు ఏర్పాటయ్యాయి. వీటికి అనూహ్య స్పందన లభించింది. యువత స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేశారు. ఈ వేడుకల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమా కార్యక్రమాలను కొనియాడారు. మరోసారి జగనన్నను గెలిపించుకుంటే జనరంజక పాలన కొనసాగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.



పిడుగురాళ్లలో పార్టీ కార్యకర్తలకు కేక్ పంచుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

▶ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా సామాజిక హితం జరిగేలా రక్తదానం చేద్దాం– జగనన్నకు శుభాకాంక్షలు' చెబుదాం అంటూ మంత్రి అంబటి రాంబాబు ఇచ్చిన పిలుపునకు అనూహ్య స్పందన లభించింది. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో గురువారం జరిగిన శిబిరంలో 863 మంది రక్తదానం చేసి సీఎంపై తమకు ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. ముందుగా మంత్రి అంబటి రాంబాబు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి దాతలను ప్రోత్సహించారు. అనంతరం వైద్యశాల ప్రాంగణంలో 51 కేజీల కేక్‌ను మంత్రి అంబటి, మాజీ శాసన సభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు తినిపించి జగన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

> ▶ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి పేదవాడూ సంతోషంగా ఉంటున్నాడని, అటువంటి పాలన అందిస్తున్న జననేత వందేళ్లు జీవించాలని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ పుట్టినరోజు సందర్భంగా మాచర్ల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో భారీ కేక్‌ను పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి భారీ జనసందోహం మధ్య కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వైఎస్ జగన్ అభిమానులు పెద్ద సంఖ్యలో రక్తదానం చేశారు.

▶ వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపించి అధికారంలోకి తీసుకు వచ్చి జగనన్నకు బహుమతిగా ఇవ్వాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సీఎం జగన్ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత ప్రకాష్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. 200 పడకల ప్రభుత్వ వైద్యశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్, ఏపీ వైద్యవిధాన్ పరిషత్ రక్తనిధి కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. తానూ రక్తదానం చేశారు. రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

▶ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజానేత అని, ఆయన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో సీఎం జన్మదిన వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. భారీ కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు పంచారు.

▶ పేదల సంక్షేమం కోసం ఎన్నో సంస్కరణలు తెచ్చి ప్రజాపాలనకు సరైన అర్థం చెప్పిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు అన్నారు. ముఖ్యమంత్రి పుట్టిన రోజు సందర్భంగా గురువారం పెదకూరపాడు, అమరావతి, క్రోసూరులలో భారీగా వేడుకలు నిర్వహించారు. కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో భారీ కేక్ కట్ చేశారు.



నరసరావుపేటలో రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

▶ పేదల గుండెల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థానం సంపాదించుకున్నారని వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకలను గురువారం బొల్లా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేశారు. గాయత్రీ నగర్‌వద్ద తాగునీటి చెరువు కట్టపై మొక్కలను నాటారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు.



వినుకొండలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



క్రోసూరులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



దాచేపల్లి మండలం గామాలపాడులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి



చిలకలూరిపేటలో రక్తదాతను పలకరిస్తున్న మల్లెల రాజేష్ నాయుడు

▶ సంక్షేమ రథసారథి, అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించటం అదృష్టంగా భావిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు చెప్పారు. పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.

రక్తదాతలకు సలాం

- రక్తదాన శిబిరం.. అద్భుత విజయం
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- మెగా రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన
- సత్తెనపల్లి నియోజకవర్గంలో 863 మంది రక్తదానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే యర్రం

సత్తెనపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పిలుపు మేరకు నిర్వహించిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో గురువారం జరిగిన శిబిరంలో 863 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి జగన్‌పై తమకు ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. ముందుగా మంత్రి అంబటి రాంబాబు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి దాతలను ప్రోత్సహించారు. అనంతరం వైద్యశాల ప్రాంగణంలో నాయకులు ఏర్పాటు చేసిన 51 కేజీల కేక్‌ను మంత్రి అంబటి, మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు తినిపించి జగన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ మంత్రి అంబటి రాంబాబు అభినందనలు తెలిపారు. రెడ్‌క్రాస్ సౌజన్యంతో జరిగిన రక్తదాన శిబిరంలో నియోజకవర్గ వ్యాప్తంగా విద్యార్థులు, కార్యకర్తలు, నాయకులు స్పందించారు. గత ఏడాది 836 మంది రక్తదానం చేయగా ఈ సంవత్సరం అంతకుమించి 863 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో గుంటూరు నగర మాజీ డెప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళీ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతాహసంతి, పల్నాడు జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ గజ్జల నాగభూషణ్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పెండెం బాబూరావు, వైస్ చైర్మన్‌లు షేక్ నాగుర్‌మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, పార్టీ మండల అధ్యక్షులు రాయపాటి పురుషోత్తమరావు, నక్కా శ్రీను, వేపూరి శ్రీనివాసరావు,భవనం రాఘవరెడ్డి, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కరరెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు కొత్త రామకృష్ణ, షేక్ కరీం, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ విద్యకు జై

పేదింటి విద్యార్థుల చేతుల్లో ట్యాబ్

- ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు
- జిల్లాలో 18,169 మంది విద్యార్థులకు ప్రయోజనం



విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ శివశంకర్, చిత్రంలో డీఈఓ శామ్యూల్

సాక్షి, నరసరావుపేట: తరాలు మారుతున్నా కొన్ని వర్గాల తలరాతల మారకూడదనన్న పెత్తందారుల భావాలను బద్దలుకొడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ బడులల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ విప్లవానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా గతేడాది నుంచి ప్రభుత్వ బడుల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీని ప్రారంభించారు. గురువారం రెండో విడత ట్యాబ్‌ల పంపిణీ మొదలైంది. జిల్లా వ్యాప్తంగా 8వ తరగతి చదువుతున్న 18,169 ట్యాబ్‌లను అందజేయనున్నారు. ఇందులో తొలివిడతగా జిల్లాకు చేరిన ట్యాబ్‌ల పంపిణీ గురువారం చేశారు. మరో నాలుగైదు రోజుల్లో ట్యాబ్‌ల పంపిణీ పూర్తి కానుంది.

- నరసరావుపేట టౌన్ హాల్‌లో డీఈఓ శ్యాముల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, పౌడా చైర్మన్ మిట్టపల్లి రమేష్ పాల్గొన్నారు. విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీని ప్రారంభించారు.
- పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు గురువారం అమరావతిలోని శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ ఆవరణలో అమరావతి, పెదకూరపాడు మండలాల 8వతరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ చేపట్టారు.
- వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు పట్టణంలోని పెద్ద మసీదు వద్దనున్న షాదీఖానాలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు.

- పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో గురువారం విద్యార్థులకు ట్యాబ్‌లను కలెక్టర్ శివశంకర్ లోతేటి పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు 8వ తరగతి నుంచి ఐఏఎస్, ఐపీఎస్, ఇంజినీర్లు డాక్టర్లు, శాస్త్రవేత్తలు కావాలన్న లక్ష్యాలు పెట్టుకుని చదువుకోవాలని సూచించారు. 2023-24 విద్యా సంవత్సరంలో ప్రతి ట్యాబ్‌లోనూ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మ్యాథ్స్ సబ్జెక్టులతోపాటుగా సందేహాల నివృత్తి కోసం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసినట్టు వివరించారు. విద్యార్థులు సులభంగా విదేశీ భాష నేర్చుకునేందుకు డ్యాలింగో యాప్ కూడా ఉందన్నారు. అవాంఛనీయ సైట్లు నిరోధించే లక్ష్యంతో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా దీన్ని రూపొందించినట్టు వెల్లడించారు.

వైఎస్సార్ సీపీ నేత హత్యకు కుట్ర ?

- మాచర్ల నియోజవర్గానికి చెందిన ఓ మండల స్థాయి నాయకుడిని చంపేందుకు స్కెచ్
- రంగంలోకి దిగిన కర్నూలు జిల్లాకు చెందిన సుఫారి గ్యాంగ్
- రెక్కీ నిర్వహిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- టీడీపీ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి రాకతో మాచర్లలో హత్యా రాజకీయాలు

మాచర్ల: మాచర్ల నియోజకవర్గానికి చెందిన ఓ వైఎస్సార్ సీపీ మండల స్థాయి నాయకుడిని చంపేందుకు పన్నిన కుట్ర గురువారం భగ్నమైంది. దీనికోసం కర్నూలు జిల్లాకు చెందిన కిరాయి హంతకులకు కొందరు సుఫారీ ఇచ్చినట్టు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే.. మాచర్లలోని ఆర్అండ్‌బీ ప్రాంతంలో గురువారం సాయంత్రం అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ ఇద్దరిని వైఎస్సార్ సీపీ దుర్గి మండల నాయకుడు మన్నెయ్య, అతని అనుచరులు పట్టుకున్నారు. వారిని స్థానిక పోలీసులకు అప్పగించగా వెంటనే స్పందించిన పోలీసులు ఆ పరిసరాల్లో ఉన్న మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం ఐదుగురు కిరాయి హంతకులు పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం. వీరి నుంచి నాలుగు కత్తులు, రెండు కారం పొడి ప్యాకెట్లు దొరికినట్లు తెలుస్తోంది. వీరంతా కర్నూలు జిల్లాకు చెందిన సుఫారీ గ్యాంగ్ ముఠా అని, బుధవారం మధ్యాహ్నం పట్టణానికి చేరుకున్నట్టు తెలుస్తోంది. అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడిని చంపేందుకు వచ్చినట్టు ప్రాథమిక విచారణలో తేలిందని సమాచారం. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిన తర్వాత వివరాలు తెలుపుతామని మాచర్ల పోలీసులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే టీడీపీ మాచర్ల ఇన్‌చార్జిగా జూలకంటి బ్రహ్మారెడ్డిని నియమించిన రోజు నుంచి హత్యా రాజకీయాలు పురుడుపోసుకున్నాయి. టీడీపీ నేతలు, కార్యకర్తలు నియోజకవర్గంలో భయాందోళలను కలిగిస్తున్నారు. ఎన్నాడు లేనివిధంగా వైఎస్సార్‌సీపీ నేతను చంపేందుకు సుఫారీ గ్యాంగ్‌ను రప్పించడం కలకలం రేపుతోంది.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్లు మృతి

మార్టూరు: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు లారీ డ్రైవర్లు అక్కడికక్కడే మృతి చెందారు. ఈఘటన గురువారం ఉదయం 5 గంటల సమయంలో మార్టూరు సమీపంలో జరిగింది. సీఐ పీ అక్కేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. ఓ లారీ రాయపూర్ నుంచి ఇనుప లోడుతో మధురై వెళ్తోంది. ఈ క్రమంలో మార్టూరు, తాతపూడి మధ్య వెనుక టైరు పంక్చరవడంతో డ్రైవర్ రాజు లారీ కిందకు దిగి టైరు మార్చుకుంటున్నాడు. ఈ క్రమంలో ఇదే మార్గంలో భద్రాచలం నుంచి టంగుటూరు వెళ్తున్న లారీ రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ప్రమాద ధాటికి లారీ కింద ఉన్న డ్రైవర్ రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల ద్వారా ప్రమాద విషయం తెలుసుకున్న సీఐ, ఎస్ఐ శ్రీనివాసరావుతో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్యాబిన్‌లో ఇరుక్కున్న వెనుక లారీ డ్రైవర్ అజయ్ సురేష్‌ను అతి కష్టం మీద వెలుపలికి తీయగా అప్పటికే అతడు మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. అధికారులు క్రేన్‌లను రప్పించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. లారీ డ్రైవర్ల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొన్న టీడీపీ నేత బ్రహ్మారెడ్డి వాహనం

- ఇద్దరికి తీవ్ర గాయాలు.. ఒకరికి స్వల్ప గాయాలు
- బ్రహ్మారెడ్డి వాహన డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం
- బాధితులపై బ్రహ్మారెడ్డి వర్గీయుల దురుసు ప్రవర్తన



బ్రహ్మారెడ్డి వాహనం ఢీకొనడంతో దెబ్బతిన్న ఆటో



తీవ్రంగా గాయపడిన అంగడి శ్రీనివాసరావు, కోటమ్మ

మాచర్ల రూరల్: మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డికి చెందిన కాన్వాయ్ వాహనం ఓ ఆటోను ఢీ కొట్టింది. దీంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మరొకరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటన మండలంలోని కంభంపాడు గ్రామం వద్ద గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం దుర్గి మండలంలోని ఓబులేశునిపల్లె గ్రామానికి చెందిన అంగడి శ్రీనివాసరావు, అంగడి కోటమ్మ, పాల్‌రాజ్ కంభంపాడు గ్రామంలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని తిరిగి స్వగ్రామానికి ఆప్పీ ఆటోలో వెళ్తుండగా, మార్గమధ్యలో కంభంపాడు సమీపంలోని ఇటుకల బట్టీ వద్ద టీడీపీ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి కాన్వాయ్ వాహనం మితిమీరిన వేగంతో వచ్చి ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురిలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఒకరు స్వల్పంగా గాయపడ్డారు. ఆటో దెబ్బతింది. ఈ సమయంలో బ్రహ్మారెడ్డి వర్గీయులు బాధితులతో వాదులాటకు దిగారు. దుర్భాషలాడారు. దీంతో స్థానికులు బ్రహ్మారెడ్డి వర్గీయులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. బాధితులపై మానవత్వం లేకుండా దురుసుగా ప్రవర్తించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. బ్రహ్మారెడ్డి వర్గీయులపై చర్యలు తీసుకోవాలని దళిత, గిరిజన సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. బాధితుల బంధువులు క్షతగాత్రులను వెంటనే మాచర్ల గవర్నమెంట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం బాధితులను మెరుగైన వైద్యం కోసం నర్సరావుపేటకు ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు రూరల్ ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటగిరి సంస్థానం క్రికెట్ క్లబ్ జట్టు విజయం



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సాధించిన షారీక్ అక్తర్

నరసరావుపేట: స్థానిక ఎస్‌కేఆర్ బీఆర్ ఏసీఏ క్రికెట్ గ్రౌండ్‌లో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఫుల్‌మెంబర్ క్లబ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్–14 బాలుర ప్రెసిడెంట్ కప్‌లో భాగంగా గురువారం గుంటూరు యునైటెడ్ క్రికెట్ క్లబ్, వెంకటగిరి సంస్థానం క్రికెట్ క్లబ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో వెంకటగిరి సంస్థానం క్రికెట్ క్లబ్ జట్టు ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుంటూరు యునైటెడ్ క్రికెట్ క్లబ్ జట్టు నిర్ణీత 40 ఓవర్లలో ఎనిమిది వికెట్లు నష్టానికి 185 పరుగులు చేసింది. గుంటూరు యునైటెడ్ క్రికెట్ క్లబ్ జట్టులోని కమ్రుద్దీన్ 47, సుమిత్ సందీప్ 42 ,తమన్ 48 పరుగులు చేయగా వెంకటగిరి సంస్థానం క్రికెట్ క్లబ్‌లోని శ్రీవంత్ రెడ్డి రెండు వికెట్లు సాధించాడు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన వెంకటగిరి సంస్థానం క్రికెట్ క్లబ్ 34.5 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి విజయానికి కావల్సిన 189 పరుగులు చేసింది. ఆ జట్టులోని షారీఖ్ అక్తర్ 63 పరుగులు, ధనుష్ 47 పరుగులు చేయగా గుంటూరు యునైటెడ్ క్రికెట్ క్లబ్ లోని సుమీత్ సందీప్‌కు మూడు వికెట్లు లభించాయి. షారీఖ్ అక్తర్ కి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. మ్యాచ్‌లను ఎ.శ్రీనివాస్ పర్యవేక్షించారు.

నిధుల గోల్‌మాల్‌పై విచారణ

- గత టీడీపీ ప్రభుత్వంలో పనులు చేయకుండానే రూ.40లక్షలు కాజేశారని ఏఈపై ఫిర్యాదు
- విచారణ చేపట్టిన అధికారులు
- విచారణలో వెలుగు చూసిన అక్రమాలు!
- ఎం.బుక్‌లో పనులు చేసినట్లుగా నమోదు



ఏఈలతో మాట్లాడుతున్న విచారణ అధికారి ఈఈ మురళీధర్

దాచేపల్లి: ప్రపంచ బ్యాంక్ నిధుల దుర్వినియోగంపై జలవనరుల శాఖ అధికారులు విచారణ చేపట్టారు. గత టీడీపీ ప్రభుత్వంలో తంగెడ మేజర్ కాలువలో పనులు చేయకుండా ఏఈ సుమారుగా రూ.40లక్షలు దుర్వినియోగం చేశారని ఫిర్యాదులు చేయటంతో ఆ శాఖ సత్తెనపల్లి ఈఈ మేకల మురళీధర్ విచారణ చేస్తున్నారు. ఈఈ మురళీధర్ నారాయణపురంలోని జలవనరుల శాఖ కార్యాలయానికి గురువారం చేరుకుని విచారణ చేపట్టారు. ఏఈలు నర్సయ్య, సౌజన్యలతో మాట్లాడి పనుల వివరాలు తెలుసుకున్నారు.

అసలేం జరిగింది..?

మేజర్ కాలువల ఆధునికీకరణకు ప్రపంచ బ్యాంక్ నిధులు మంజూరు చేసింది. తంగెడ మేజర్ కాలువలో 13.000, 20.860, 16.400, 21.000 కిలోమీటర్ల దగ్గర 2016–17 సంవత్సరంలో చెక్‌డ్యాంలు, కాంక్రీట్ పనులు చేసినట్లుగా అప్పటి ఏఈగా విధులు నిర్వహించిన పసుపులేటి ఆదినారాయణ సూమారుగా రూ.40లక్షలు ఎంబుక్ చేసి నిధులు డ్రా చేశారు. అయితే ఈ నిధులతో పనులు చేయకుండా దుర్వినియోగం చేశారని ఏఈ ఆదినారాయణపై దాచేపల్లికి చెందిన సుంకర సాంబశివరావు, సారంగపల్లి అగ్రహారంకు చెందిన కందుల జాను జిల్లా కలెక్టర్‌తో పాటుగా సంబంధిత శాఖ అధికారులకు ఈ ఏడాది మే 6వ తేదీన ఫిర్యాదు చేశారు. పై కిలోమీటర్లలో తట్ట మట్టి కూడా పోయకుండా ఏఈ ఆదినారాయణ కాంట్రాక్టర్లతో కుమ్మక్కై నిధులు కాజేశారని సాంబశివరావు ఫిర్యాదులో పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ ఆదేశాలతో విచారణ..

దీనిపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జలవనరుల శాఖ ఉన్నతాధికారులు సత్తెనపల్లి ఈఈగా విధులు నిర్వహిస్తున్న మేకల మురళీధర్‌ను విచారణ అధికారిగా నియమించారు. ఈక్రమంలో ఆయన నారాయణపురంలోని కార్యాలయానికి చేరుకుని రికార్డులు క్షుణంగా పరిశీలించారు. మంజూరైన నిధులకు సంబంధించి ఏఏ పనులు చేశారనే అంశాలపై దృష్టిపెట్టి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుత ఏఈలు నర్సయ్య, సౌజన్య పనులకు సంబంధించిన రికార్డులు చూపించారు. 2019లో డీఈగా అదినారాయణకు ప్రమోషన్ రావటంతో ఎం.బుక్ రికార్డులు ఇవ్వకుండా రిలీవ్ అయిన తరువాత గత 10 రోజుల క్రితమే ఇచ్చినట్లు అధికారులు చెప్పారు. ఎం.బుక్‌లను పరిశీలించిన విచారణ అధికారి పనులు చేసినట్లుగా రికార్డు చేసినట్లు గుర్తించారు. తంగెడ మేజర్ కాలువలో పనులు చేయకుండనే నిధులు దుర్వినియోగం చేసినట్లుగా అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. పై కిలోమీటర్ల నెంబర్ల వద్ద ఎటువంటి పనులు జరగనట్లుగా గుర్తించామని, కానీ ఎంబుక్‌లో మాత్రం పనులు చేసినట్లుగా రికార్డు చేశారని, దీనిపై పూర్తి విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని విచారణ అధికారి మురళీధర్ చెప్పారు.

సైనిక లాంఛనాలతో జవాను అంత్యక్రియలు

- గౌరవ వందనం సమర్పించిన జవాన్‌లు
- ఉదయభాస్కర్ భౌతిక దేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



జవాను ఉదయ భాస్కర్(ఫైల్)

పిడుగురాళ్ల: సీఆర్‌పీఎఫ్ జవాన్ చిన్నపోతుల ఉదయ భాస్కర్ అంతిమ యాత్ర ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బ్రహ్మానందరెడ్డి ఎస్టీ కాలనీకి చెందిన చిన్నపోతుల ఉదయ భాస్కర్(39) సీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్‌గా చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 19వ తేదీన విధి నిర్వహణలో ఉన్న చిన్నపోతుల ఉదయ భాస్కర్‌కు ఒక్కసారిగా గుండెపోటు రావటంతో దంతెవాడలోని జిల్లాల్లోని హాస్పటల్‌కు తరలించారు. చికిత్స పొందుతుండగానే ఉదయ భాస్కర్ మృతి చెందినట్లు 39వ బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ ఎస్ఐ రమేష్‌కుమార్ పాండే తెలిపారు. దీంతో భౌతిక దేహాన్ని సైనిక లాంఛనాలతో ప్రత్యేక వాహనంలో పిడుగురాళ్ల పట్టణంలోని బ్రహ్మానందరెడ్డి ఎస్టీ కాలనీలోని విజయభాస్కర్ స్వగృహానికి తీసుకొని రావటం జరిగిందన్నారు. అక్కడి నుంచి ప్రత్యేక రథం ద్వారా భారీ ర్యాలీగా రావటం జరిగిందన్నారు. 39వ బెటాలియన్‌కు చెందిన 11 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, మరో 9 మంది జవాన్‌లు హాజరై సైనిక వందనం సమర్పించారు. అనంతరం శవపేటికపై ఉన్న జాతీయ పతాకాన్ని గౌరవప్రదంగా మృతుని కుమారుడికి అందజేసి, అనంతరం భౌతికదేహానికి సెల్యూట్ చేశారు. జవాను భౌతిక దేహం ముందు ప్రత్యేక పుష్పగుచ్ఛాలను జవాన్, ఎస్ఐ, కమాండర్ స్థాయి అధికారులు ఉంచి గౌరవవందనం సమర్పించారు.



జవాను భౌతిక దేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

జవాన్‌కు ఎమ్మెల్యే నివాళులు...

సీఆర్‌పీఎఫ్ జవాన్ చిన్నబోతుల విజయభాస్కర్ మృతి చెందిన సమాచారాన్ని తెలుసుకున్న గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి భౌతికదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.



దుర్గి మండలం పోలేపల్లిలో లూథరన్ చర్చిని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి - దుర్గి

క్రీస్తు చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీయం



నెహ్రూ నగర్: క్రీస్తు మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని వైఎస్సార్ సీపీ నాయకులు విడదల కుమారస్వామి పేర్కొన్నారు. 24వ డివిజన్‌లో మహిమా జీసెస్ మినిస్ట్రీస్ అధ్యక్షురాలు జి.మహిమ కుమారి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఆడక పద్మావతి, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ళ అరుణ్ కుమార్, పలువురు నాయకులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఏసీఏ క్లబ్స్ టోర్నీలో బ్లాక్ షర్ట్స్ సీసీ జట్టు విజయం

సెంచరీతో రాణించిన చరణ్ రాజు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ప్రెసిడెంట్స్ కప్ అండర్–14 ఏసీఏ క్లబ్స్ టోర్నమెంట్‌లో భాగంగా గురువారం స్థానిక అరండల్‌పేటలోని పిచ్చుకుల గుంట క్రీడా మైదానంలో గుంటూరు క్రికెట్ క్లబ్ – బ్లాక్ షర్ట్స్ సీసీ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. తొలుత టాస్ గెలిచిన గుంటూరు క్రికెట్ క్లబ్ బ్యాటింగ్ తీసుకుంది. 37.2 ఓవర్లలో 180 పరుగులకు ఆల్ అవుటైంది. జట్టులో యాసిన్ సిద్దిఖీ 54 బాల్స్‌లో 14 బౌండరీలతో 71 పరుగులు చేయగా, చమళ్లమూడి 5 బౌండరీలతో 35 పరుగులు చేశాడు. బ్లాక్ షర్ట్స్ సీసీ జట్టులో ఆనంద్ కుమార్ 3, జె.దినేష్ త్రివిక్రమ్ సింగ్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్ చేసిన బ్లాక్ షర్ట్స్ సీసీ జట్టు కేవలం 30.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 182 పరుగులు చేసి 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

వర్సిటీ మహిళల ఖోఖో పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న ఎం.శేషగిరిరావు



పోటీల్లో తలపడుతున్న జట్లు

నరసరావుపేట రూరల్: చదువుతోపాటు ఆటల్లో కూడా రాణించాలని ఎంఏఎం ఫార్మసీ కళాశాల కరస్పాండెంట్ మేదరమెట్ల శేషగిరిరావు తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాలల మహిళల ఖోఖో పోటీలు, వర్సిటీ జట్టు ఎంపిక కేసానుపల్లిలోని మేదరమెట్ల అంజమ్మ, మస్తాన్‌రావు ఫార్మసీ కళాశాలలో గురువారం ప్రారంభమయ్యాయి. పోటీల ప్రారంభకార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా జిల్లా ఖోఖో అసోసియేషన్ మాజీ సభ్యులు డి.కోటేశ్వరరావు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కోచ్ పి.రావుకిషోర్, కళాశాల కార్యదర్శి ఎం.శేషగిరిరావులు పాల్గొన్నారు. అతిథులు మాట్లాడుతూ ఆడపిల్ల చదువు ఇంటి వెలుగు అని తెలిపారు. చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటాలని సూచించారు. ప్రతిభ గల క్రీడాకారులను వెలికి తీయడానికి ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. జాతీయ స్థాయిలో ప్రతిభను చాటేందుకు వర్సిటీ పోటీలు ఉపకరిస్తాయని తెలిపారు. రెండు రోజుల పాటు జరగనున్న పోటీల్లో గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి తొమ్మిది జట్లు పాల్గొన్నాయి. కృష్ణవేణి డిగ్రీ కళాశాల(నరసరావుపేట), నాగార్జున యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజి, ధనలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజి, జీసీ అండ్ వైపీఎస్ కాలేజి(కనిగిరి) లీగ్ దశకు చేరుకున్నాయి. పోటీల వర్సిటీ పరిశీలకులుగా సీహెచ్ వెంకట్రావు, సెలక్షన్ కమిటీ సభ్యులుగా డాక్టర్ కె.అరుణసుజాత, ఆదిబాబులు వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల డైరెక్టర్ డి.శ్రావ్య, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు, కేఎస్‌పీఆర్ బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.మంగేశ్వరి, ధనలక్ష్మి కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్రావులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో రెండు బంగారు పతకాలు

విద్యార్థిని నందినిని అభినందించిన జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్, అధ్యాపకులు



నరసరావుపేట: స్థానిక జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల మూడో ఏడాది ఎలక్ట్రికల్ బ్రాంచ్ విద్యార్థిని బి.నందిని అథ్లెటిక్స్ పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పీజీ శ్రీనివాసరావు గురువారం వెల్లడించారు. ఈనెల 16, 17 తేదీలలో తూర్పుగోదావరి జిల్లా సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన 11వ జేఎన్‌టీయూ కాకినాడ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ చాంపియన్ షిప్–2023 పోటీల్లో నందిని పాల్గొని, వంద మీటర్ల పరుగు పందెం, 100 మీటర్ల హార్డిల్స్‌లో రెండు మెడల్స్ సాధించిందన్నారు. వంద మీటర్ల పరుగులో వేగవంతమైన మహిళగా అవార్డు తీసుకోవటం జరిగిందన్నారు. ఈ మేరకు గురువారం కళాశాలలో నిర్వహించిన అభినందన సభలో విద్యార్థిని నందినికి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు. ఈనెల 26వ తేదీ నుంచి ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ కేఐటీ యూనివర్సిటీలో నిర్వహించే సౌత్ అండ్ వెస్ట్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు కాకినాడ జేఎన్‌టీయూ తరఫున రెండు విభాగాల పోటీల్లో పాల్గొంటుందన్నారు. తమ కళాశాల విద్యార్థిని నేషనల్ అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొనడం హర్షించదగ్గ విషయమని వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసరు కె.శోభన్‌బాబు అన్నారు. వివిధ విభాగ అధిపతులు, వ్యాయామ సంచాలకులు డాక్టరు జీపీ రాజు, టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ స్టాఫ్ నందినికి అభినందనలు తెలిపారు.

లక్షలాది మంది జీవితాలకు జగనన్న భరోసా



కేక్ కట్ చేస్తున్న ఏపీజీఈఎఫ్ చైర్మన్ వెంకట రామిరెడ్డి

గుంటూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజును రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు అంగరంగ వైభవంగా జరుపుకొంటున్నారని ఏపీజీఈఎఫ్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి తెలిపారు. గురువారం గ్రామ, వార్డు సచివా లయం ఉద్యోగుల శిక్షణ కేంద్రంలో జరిగిన ముఖ్యమంత్రి జన్మదిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ జన్మదినాన్ని గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థాపక దినోత్సవంగా జరుపుకోవటం సంతోషకరమన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని ఉద్యోగాల భర్తీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేసిందన్నారు. ఒకే నోటిఫికేషన్‌లో లక్షా ముప్పైనాలుగు వేల మందిని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులగా నియమించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి కుటుంబాలకు భరోసా కల్పించారన్నారు. ఆయన మనసులో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఎప్పుడు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ వ్యవస్థ సీఎం ఆలోచన ద్వారా వచ్చిందన్నారు. ఇది ఆయన మానస పుత్రిక అన్నారు. అంతేకాక ఉద్యోగులకు ప్రొబేషన్ డిక్లేరేషన్ చేయటమే కాక పే స్కేల్ కల్పించి శాశ్వత ఉద్యోగ భద్రత అనుగ్రహించిన మనసున్న మహారాజు జగనన్న అన్నారు.కేక్ కటింగ్ చేసి ముఖ్యమంత్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.